**Eenadu**

# త్వరలో ఏఈ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

ఈనాడు, హైదరాబాద్, విశాఖపట్టణం

వయో పరిమితి జి.ఒ. కాలపరిమితి ముగిసేలోగానే సాధ్యమైనంత వరకు ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్లను జారీ చేయాలని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ భావిస్తోంది. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ (ఏఈఈ) ఉద్యోగాల భర్తీకి గత వారం ప్రకటన జారీ చేసిన విషయం విదితమే. నవంబరు మొదటి వారంలో ఈ నియామకాల రాత పరీక్షలు జరిపిన వెంటనే ప్రాథమిక 'కీ', తుది 'కీ'ని ప్రకటించి ఫలితాలను వెంటనే విడుదల చేయాలని ఏపీపీఎస్సీ వర్గాలు భావిస్తున్నాయి. ఇక అసిస్టెంట్ ఇంజినీరింగ్ (ఏఈ) ఉద్యోగాల భర్తీ ప్రకటన ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. సుమారు 300 సివిల్, మెకానికల్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ ఉద్యోగాలను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నారు. గ్రూపు-2 కింద 750 పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపినందున దీనికి సంబంధించి ప్రకటన జారీ చేయాల్సి ఉంది. కమర్షియల్ టాక్స్ అధికారుల నుంచి వివరాలు అందాల్సి ఉంది. పంచాయతీ రాజ్ శాఖ తరఫున పంచాయతీ కార్యదర్శి - 4 కింద (గ్రూపు-3) 1000 ఉద్యోగాల భర్తీకి ప్రకటన జారీ చేసేందుకు సిద్ధంగా ఉంది. గ్రూపు-2 నోటిఫికేషన్ జారీ చేసిన అనంతరం పంచాయతీ కార్యదర్శుల నోటిఫికేషన్ జారీ చేస్తే అభ్యర్థులకు ఉపయోగంగా ఉంటుందని ఏపీపీఎస్సీ వర్గాలు భావిస్తున్నాయి.

## కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా చర్యలు

ఏపీపీఎస్సీ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఉదయ్‌భాస్కర్ బుధవారం వైజాగ్‌లో 'ఈనాడు'తో మాట్లాడుతూ నోటిఫికేషన్ జారీ జరిగిన ఆరునెలల్లోగా నియామక ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తున్నామని వెల్లడించారు. "ఓసీ అభ్యర్థులకు 40 ఏళ్ల వరకు, ఇతర సామాజికవర్గాల వారీగా వయో పరిమితి పెంపు జీఓ గడువు వచ్చే నెల 30వ తేదీలోగా ముగియనుంది. ఈలోగానే ప్రకటనల జారీకి చర్యలను తీసుకుంటున్నాం. సాంకేతిక కారణాలతో నోటిఫికేషన్లు విడుదల చేయలేకపోతే ప్రభుత్వం వయోపరిమితి పెంపుపై మరో జీఓ జారీ చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ప్రతి ప్రశ్నపత్రంలో ప్రశ్నలన్నీ ఒకటే. వాటి స్థానం మాత్రం ఒక్కో ప్రశ్న పత్రంలో ఒక్కోలా ఉంటుంది. మూడు నాలుగు సిరీస్‌ల వల్ల కాపీకి ఆస్కారం ఉంటుందన్న ఉద్దేశంతో ఈ విధానాన్ని మొట్ట మొదటిసారిగా అందుబాటులోకి తెస్తున్నాం. ప్రతి ప్రశ్నకు ఉండే నాలుగు సమాధానాల వరుస కూడా ప్రతి ప్రశ్నపత్రానికి మారిపోతుంది. సాధారణంగా ప్రశ్నలను మాత్రమే జంబ్లింగ్‌లో ఇస్తున్నాం. ఇప్పుడు ప్రతి ప్రశ్నకు ఇవ్వాల్సిన జవాబులు కూడా ప్రశ్నపత్రంతో మారిపోతున్నందున మాల్‌ప్రాక్టీసెస్‌ను గణనీయంగా తగ్గించేస్తుంది. ఎంపికైన అభ్యర్థులు వారిచ్చిన ప్రాధాన్య క్రమానికి అనుగుణంగా, సాధించిన మార్కులకు లోబడి ప్రభుత్వ శాఖలు కేటాయించే ప్రక్రియను కూడా ఆన్‌లైన్లోనే జరిగేలా చేయాలని ఆలోచిస్తున్నామని" ఆయన వివరించారు.